సాక్షి
మంచిర్యాల
సోమవారం : 18 : సెప్టెంబర్ : 2023



కర్ర గణేష్‌ను కొలుద్దాం 8లో▸

తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గణేష్‌లకు ప్రత్యేకత ఉంది. ఇక్కడ నవరాత్రుల్లో కర్ర వినాయకులు కొలువు దీరుతారు. దశాబ్దాలుగా అవే ప్రతిమలు కొలువుదీరడం విశేషం.



మంచిర్యాల మార్కెట్లో వినాయకుల కొనుగోళ్లు

న్యూస్‌రీల్

జీఓ 58, 59 ప్రజలకు వరం



పట్టాలు అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి యాజమాన్య హక్కు కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ నం 58, 59 ఒక వరమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం సమీకృత కలెక్టరేట్‌లో మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి జీఓ 58, 59 లబ్ధిదారులు నస్పూర్‌కు చెందిన వేముల రమేష్, కారపూరి రజిత, వసంత, సురేష్‌లకు పట్టాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జీఓ 59 కింద దరఖాస్తు చేసుకుని నోటీసులు పొందిన వారు నిర్ణీత గడువులోగా ప్రభుత్వ రుసుం చెల్లించి పట్టా పొందాలని తెలిపారు.

సాంస్కృతిక పోటీల్లో విద్యార్థి ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రాష్ట్రపతి నిలయం బొల్లారంలో లిబరేషన్ డే ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్చరల్ ప్రోగాంలో మంచిర్యాలలోని హమాలీవాడకు చెందిన గోగుల శివరోహన్‌రెడ్డి ప్రతిభ కనబర్చాడు. మల్లారెడ్డి రాజశేఖర్‌రెడ్డి కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న శివరోహన్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి సాధించి గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నాడు. తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని తెలంగాణ పోరాటం అనే నాటక రూపంలో ప్రదర్శించి మెప్పించారు. తన తండ్రి గోగుల రవీందర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ సమయంలో జైలు జీవితంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, ఇతర అంశాలను నాటక రూపంలో ప్రదర్శించి బహుమతి అందుకోవడం ఆనందంగా ఉందని శివరోహన్‌రెడ్డి తెలిపాడు.

బెటాలియన్‌లో జాతీయ సమైక్యత దినోత్సవం



జాతీయ జెండాకు శరత్‌కుమార్ వందనం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఇంచార్జి కమాండెంట్ కే.పీ.శరత్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం బెటాలియన్ పరేడ్ సిబ్బంది ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్, బెటాలియన్ వైద్యుడు డాక్టర్ శ్రీధర్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మకు పూజలు నిర్వహిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రం మంచిర్యాలలో విశ్వకర్మ జయంతిని స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. యజ్ఞం, ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానం చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని జగదాంబ కాంప్లెక్స్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ, స్వర్ణకారుల సంఘం నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, పట్టణ అధ్యక్షుడు కొండపర్తి సంజీవ్, నాయకులు ఎర్రోజు వేణుగోపాల్, గుండోజు రమేష్, కొక్కొండ రమణయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి రవీందర్, విశ్వబ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టల రమేష్, ప్రధాన కార్యదర్శి కోటోజు రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దపల్లి మధు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామి



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, పక్కన కలెక్టర్ బి.సంతోష్

- ప్రజల మధ్య సమైక్యతే నిజమైన దేశభక్తి
- మత పిచ్చి మంటలు రేపాలని విచ్ఛిన్న శక్తుల కుట్రలు
- ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్
- ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆనాడు ఉద్యమం చేసి తెలంగాణ సాధించుకుంటే నేడు సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఆదివారం జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో విప్ సుమన్ కలెక్టర్ బి.సంతోష్, అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, డీసీపీ రాంనాథ్ కేకన్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విప్ సుమన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛను పొందడం కోసం యావత్ సమాజం ఉద్యమించిందని తెలిపారు. ఆనాటి త్యాగాలు, అపూర్వ ఘట్టాలు జాతి జీవనంలో నిరంతరం సజీవంగా నిలిచిపోతాయని అన్నారు. 75ఏళ్ల స్వాతంత్య్ర భారతంలో తెలంగాణ 60ఏళ్లు అస్తిత్వం కోసం ఉద్యమించిందని చెప్పారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ద్వారా సాధించుకుని అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెడుతున్న రాష్ట్రంలో ఢిల్లీ లీడర్లు ఓర్వలేక విచ్ఛిన్నానికి పన్నాగం పన్నుతున్నారని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న ప్రజల మధ్య సమైక్యత స్ఫూర్తిని దెబ్బతీసేందుకు కొన్ని మత పిచ్చి శక్తులు మంటలు రేపాలని కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఈ దశలో మనందరం అప్రమత్తంగా కుట్రలను తిప్పికొడదామని, వివేకంతో విద్వేషాన్ని ఓడిద్దామని, సకల జనుల విశ్వాసంతో తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధిని ఇలాగే కొనసాగిస్తూ జాతీయ సమైక్యత దినోత్సవ స్ఫూర్తితో జాతి సమగ్రతను నిలబెట్టుకుంటూ ప్రజల మధ్య ఐక్యత చెదరనివ్వకుండా కాపాడుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, గ్రంథాలయ చైర్మన్ ప్రవీణ్, జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న సుమన్

కాంగ్రెస్‌తోనే తెలంగాణ ఆలస్యం..

కాంగ్రెస్ ప్రభుత్వం బలవంతంగా 1956లో రాష్ట్రాలను కలిపిందని, దీంతో నీళ్లు, నిధులు తెలంగాణకు దక్కకుండా పోయాయని విప్ సుమన్ అన్నారు. తదనంతరం ఉద్యమిస్తే 356 మందిని ప్రజలను చంపివేశారని, మలి దశ కేసీఆర్ ఉద్యమంతో దిగివచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందని తెలిపారు. ఉద్యమాలు, పోరాటలు చేసినా ఏళ్ల తరబడి ఆలస్యం చేయడం, ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు.

తెలంగాణ ద్రోహి రేవంత్‌రెడ్డి..

2009 మలి దశ తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్‌రెడ్డి చంద్రబాబుతో కలిసి సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక రాష్ట్రం రాకుండా అడ్డుకున్న ద్రోహి అని విప్ సుమన్ ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు తీరని ద్రోహం చేసిందని గోదావరి, కృష్ణ జలాలను ఆంధ్రాకు తరలించి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకున్నారని, తాగు, సాగునీరు అందని తెలంగాణగా మార్చారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తమ్మిడిహెట్టి ప్రాజెక్టు పేరుతో తట్టెడు మట్టి కూడా వేయలేదని, కాలువల పేరుతో సారంగాలు తవ్వి కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణంతో లక్షల ఎకరాల పంటకు నీరందిస్తున్నారని తెలిపారు.

నవరాత్రోత్సవాలకు సిద్ధం



పూజ సామగ్రి విక్రయాలు



వినాయకులను తరలిస్తున్న నిర్వాహకులు

- నేడు కొలువుదీరనున్న వినాయకులు
- మట్టి గణపతిలకు జై..

మంచిర్యాలఅర్బన్: వినాయక నవరాత్రోత్సవాలకు జిల్లా సిద్ధమైంది. యువకులు, పిల్లలు, పెద్దలు, మహిళలు ఆనందంగా నిర్వహించే వినాయక చవితి వేడుక సోమవారం ప్రారంభం కానుంది. రంగు రంగుల విభిన్న ఆకృతిలో గణనాథులు కొలువుదీరనున్నాయి. తయారీ కేంద్రాల నుంచి వినాయక ప్రతిమలను మండపాలకు తరలిస్తున్నారు. పర్యావరణ హితం కోసం మట్టి గణపతుల ఏర్పాటుకు మండపాల నిర్వాహకులు ప్రాధాన్యం ఇస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నాయి.

పర్వదినం.. పర్యావరణ హితం

పర్యావరణానికి హాని కలిగించే పీవోపీ ప్రతిమల నుంచి మట్టి వినాయకుల వైపు మొగ్గు చూపుతున్నారు. మట్టికి సులువుగా కరిగే గుణం ఉంటుంది. గతంలో ప్రతిమల తయారీలో చెరువు మట్టి వినియోగంతో పూడిక సమస్యలు తొలగే అవకాశాలు ఉండడంతో మట్టికి ప్రాధాన్యం ఇచ్చేవారు. వర్షాకాలంలో వరదల తర్వాత ఏర్పడే నీటి కాలుష్యం నివారణకు 18రకాల పత్రులతో మట్టి విగ్రహాన్ని పూజించి తెల్లవారే నదిలో నిమజ్జనం చేసేవారు. పత్రులు నీటిని శుభ్రపర్చడంలో ఆరితేరినవని చెబుతుంటారు.

మార్కెట్లో సందడి

మంచిర్యాల బెల్లంపల్లి, చెన్నూర్ తదితర పట్టణాల్లోని మార్కెట్లలో ఆదివారం పండుగ వాతావరణం నెలకొంది. గణేషుని కొలిచేందుకు అవసరమైన పూజ సామగ్రి కొనుగోలుతో సందడి ఏర్పడింది. మంచిర్యాలలో వినాయక పత్రి, పండ్లు, పూజా సామగ్రి విక్రయానికి రహదారి పొడవునా తాత్కాలిక దుకాణా లు ఏర్పాటు చేశారు. ఎలక్కాయలు, తామరపువ్వులు, మామిడి ఆకులు, ఉసిరి, సీతాఫలాలతోపాటు పత్రి ఆకులు కొనుగోలు చేశారు. గణపతి విగ్రహాల కోసం తరలి రావడంతో వినాయక విక్రయ కేంద్రాల వద్ద సందడి నెలకొంది.

చంద్రయాన్ గణేష్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని మర్వాడీ ధర్మశాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మర్వాడీ సమాజ్ యువకులు గణపతి ప్రతిమ ఏర్పాటు కోసం మండపాన్ని చంద్రయాన్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారు. చంద్రయాన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గణేశ్ మండపాన్ని తయారు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మండపం పనులు సోమవారం ఉదయం పూర్తవుతాయని పేర్కొన్నారు.



ముస్తాబవుతున్న మండపం

మట్టి ప్రతిమలు పర్యావరణానికి మేలు



విశ్వకర్మ చిత్రపటానికి కలెక్టర్, విప్ నివాళులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న విప్

- విశ్వకర్మ జయంతి అధికారికంగా నిర్వహించడం సంతోషం
- వచ్చే ఏడాది నుంచే పెద్ద మట్టి గణపతి తయారీ
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్

మంచిర్యాలఅగ్రికల్చర్: వాస్తు శిల్పి, ప్రతిమశాస్త్ర పితామహుడు విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. మట్టి వినాయక ప్రతిమలు పర్యావరణానికి మేలు చేస్తాయని తెలిపారు. ఆదివారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యలతో కలిసి విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతి పర్యావరణ రక్షణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేసి మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ సుమన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం హరితహారంలో భాగంగా దాదాపు 200 కోట్ల మొక్కలు నాటి సంరక్షిస్తోందని, రాష్ట్రంలో పర్యావరణ సమతుల్యత ఏర్పడి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడిందని తెలిపారు. చెరువు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 10 వేల సీడ్ గణేష్ విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, వచ్చే సంవత్సరం చెరువుల మట్టితో పెద్ద విగ్రహాలు తయారీ చేసి ఉచిత పంపిణీ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి వినోద్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్, జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన దీక్ష

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 20, 21వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్లు మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.యాదగిరి తెలిపారు. ఆదివారం బెల్లంపల్లిలో నిరసన దీక్ష వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణకు మద్దతు పలుకుతుండడం శోచనీయమని అన్నారు. ఏ, బీ, సీ, డీ వర్గీకరణకు ఏ రాజకీయ పార్టీ మద్దతు తెలిపినా ఎన్నికల్లో ఓడిస్తామని హెచ్చరించారు. కాలం చెల్లిన వర్గీకరణ అంశాన్ని మళ్లీ తెరపైకి తెచ్చి కొన్ని అగ్రవర్గ రాజకీయ పార్టీలు మాలమాదిగలను విడగొట్టే చర్యలకు సిద్ధపడుతున్నాయని విమర్శించారు. నిరసన దీక్షతో మాలల సత్తా చాటుతామని పేర్కొన్నారు. మాలలు, అనుబంధ సంఘాల శ్రేణులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షుడు గుర్రం ప్రదీప్, నియోజకవర్గ నాయకులు ఎరుకల శ్రీనివాస్, దాసరి జయ, లింగాల అమృత, నాయకులు పోశం, రవి, రాకేష్, శ్రీనివాస్, ప్రసాద్, సాయి, రాధ, కిశోర్ పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని నిరసన

బెల్లంపల్లి: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు నిరసన వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తుండగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రవిని ఉద్దేశించి ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడంతో అంగన్‌వాడీ టీచర్లు కోపోద్రిక్తులయ్యారు. అక్కడే ఉన్న మున్సిపల్ కౌన్సిలర్ రవి కాలర్‌పట్టి లాగడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం శ్రేణులు, అంగన్‌వాడీ టీచర్లు క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య, బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఏఎస్సై తిరుపతి క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు ఘటనాస్థలి నుంచి వెళ్లిపోయారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



జాతీయ జెండాకు నాయకుల వందనం

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో అర్చన టెక్స్ చౌరస్తాలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటుకు ముందు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేసిన కేసీఆర్ అధికారంలోకి రాగానే జాతీయ సమైక్యత దినోత్సవం అంటూ కొత్త నాటకాలకు తెరతీశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీశ్ జైన్, పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, తాజ్‌ఖాన్, రఘునందన్, గాజుల ప్రభాకర్, చిప్పరి రాజమల్లయ్య, బుద్దారపు రాజమౌళి, అమిరిశెట్టి రాజు, రాకేశ్ రెన్వా, నాగుల రాజన్న, పల్లె రాకేశ్, అశోక్ పాల్గొన్నారు. భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు గుంటక సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి కాలనీలో నైజాం విముక్త దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంకి మహేశ్, రంగు ప్రకాశ్, నెల్లి గోపాల్, పడాల లింగారెడ్డి, కిరణ్, నరేశ్, గుండా ప్రకాశ్, మాల కొండయ్య, కర్ణకంటి రవీందర్ పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తాలో జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా జనసేన ఇంచార్జి సైదల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కర్ర గణేష్‌ను కొలుద్దాం



అలంకరణకు ముందు భోసి కర్ర గణేషుడు

- సరిహద్దులో పర్యావరణహితం
- 1948–50 నుంచి కర్ర విగ్రహాలే..
- ఊరంతా ఒకటే ప్రతిమకు పూజ
- మన ఊళ్లు, మరాఠీ పల్లెల్లో ఆనవాయితీ



మహారాష్ట్రలోని పాలజ్ కర్ర వినాయకుడు

నిర్మల్: గణేష్ ఉత్సవాల్లో ఒక్కో ప్రాంతానికి ఒక్కో విశేషం ఉంటుంది. అందులో తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి మరింత ప్రత్యేకత ఉంది. ఇక్కడ నవరాత్రుల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనిక రంగులు లేకుండా, కనీసం మట్టితోనూ సంబంధం లేకుండా కర్ర వినాయకులు కొలువు దీరుతారు. ఇలా నిన్న మొన్నటి నుంచి కాదు..ఏడెనిమిది దశాబ్దాలుగా అవే వినాయక ప్రతిమలు కొలువుదీరడం విశేషం. నిర్మల్–మహారాష్ట్ర సరిహద్దులోని కర్ర గణేశుడి కథేందో తెలుసుకుందాం.

అలా మొదలై..

స్వాతంత్ర్య ఉద్యమకాలంలో ప్రజలను ఏకతాటిపైకి తెచ్చేందుకు మహారాష్ట్రలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఆ మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో స్వాతంత్ర్యానికి పూర్వమే కలరా, ప్లేగు వ్యాధులు ప్రబలడంతోపాటు కరువు కాటకాలు ఏర్పడ్డాయి. ప్రజలకు తాగడానికి కూడా నీరు దొరకని పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాంటి సందర్భంలో గణేష్ నవరాత్రులు వచ్చాయి. అప్పుడు అక్కడి ప్రజలు నిమజ్జనం చేసే పరిస్థితులు లేనందున నీటితో అవసరం లేకుండా ఉండేలా కర్రతో గణపతిని చేయించాలని నిశ్చయించారు. ముందుగా తెలంగాణ సరిహద్దు పక్కనే మహారాష్ట్రలోని భోకర్ తాలూకాలోని పాలజ్ అనే గ్రామస్తులు 1948లో నిర్మల్‌లో కొయ్యబొమ్మలు చేసే నకాశీ కళాకారుడైన గుండాజీవర్మను కలిశారు. ఆయన నిష్టతో ఒకే కర్రతో, సహజసిద్ధమైన రంగులతో అందంగా గణపతిని తయారు చేసి ఇచ్చారు. ఆ ఊరంతటికీ ఆ కర్ర గణపతినే ప్రతిష్ఠించడంతో కొంతకాలానికే కరువు కాటకాలు, వ్యాధులు దూరమయ్యాయి. అలా..కర్ర గణపతి రాకతోనే తమ ఊరు మారిందని నమ్ముతూ దాదాపు ఏడెనిమిది దశాబ్దాలుగా అదే కర్ర వినాయకుడిని ప్రతీ ఏడాది ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. నవరాత్రులు ముగియగానే కాసిన్ని నీళ్లు చల్లి, మళ్లీ బీరువాలో భద్రపరుస్తున్నారు.

మన ఊళ్లు..మరాఠీ పల్లెల్లో..

కర్ర గణపయ్య కేవలం పాలజ్‌కే పరిమితం కాలేదు. సరిహద్దులోని పలు తెలంగాణ పల్లెలు, మరాఠీ ఊళ్లల్లోనూ అదే ఆనవాయితీ ఏర్పడింది. ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకాలోని చిక్లీ, నిర్మల్ జిల్లాలోని తానూరు మండలం భోసి, కుభీర్ మండలంలోని కుభీర్, పార్డీ, భైంసా మండలం మాటేగాంలలో దశాబ్దాలుగా కర్ర గణేషులే కొలువుదీరుతున్నాయి. ఆరేళ్ల నుంచి జిల్లా కేంద్రంలోని విశ్వకర్మ సంఘంలోనూ కర్ర గణపతికి పూజలు చేస్తున్నారు.



మహారాష్ట్రలోని చిక్లీలో కర్ర గణేషుడు(ఫైల్)

ఎలా వెళ్లాలంటే..

దేశంలో ఎక్కడా లేనివిధంగా కర్ర గణేషులను ప్రతిష్ఠించి పూజించడం ఇక్కడే ఉంది. పర్యావరణ హితుడిగానే కాకుండా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే సత్యదేవుడిగానూ ఈ కర్ర గణేష్‌లు నిలుస్తున్నాయి. ఈ కారణంగా వినాయక నవరాత్రుల్లో వేలాది భక్తులు ఈసరిహద్దు గ్రామాలకు తరలివస్తున్నారు. ఒక్క పాలజ్‌లోనే నవరాత్రుల్లో రోజుకు కనీసం పదివేల మంది దర్శించుకోవడం గమనార్హం.

- హైదరాబాద్ నుంచి పాలజ్ మొత్తం 286కి.మీ దూరం ఉంటుంది. కామారెడ్డి, డిచ్‌పల్లి, నిజామాబాద్, బాసర మీదుగా భైంసా చేరుకోవాలి. అక్కడి నుంచి 23 కి.మీ దూరంలో పాలజ్ ఉంటుంది. భైంసా నుంచి తెలంగాణ, మహారాష్ట్ర బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉటాయి.
- తానూరు మండలంలోని భోసిలో వరసిద్ధి వినాయకుడిగా పూజలందుకుంటున్నాడు. ఇక్కడి కర్ర గణపతిని దర్శించుకోవాలంటే భైంసా నుంచి 11 కి.మీ వెళ్లాలి. మాంజ్రి, భోసి ఎక్స్ రోడ్డు గ్రామానికి చేరుకోవచ్చు. భైంసా–భోకర్ వెళ్లే ప్రధాన రహదారిలో భోసి ఎక్స్‌రోడ్డు వస్తుంది. ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంటుంది.
- మహారాష్ట్రలోని చిక్లీ కర్ర గణేశ్‌ను దర్శించుకోవాలంటే భైంసా నుంచి దాదాపు 25 కి.మీ ఉంటుంది. మహాగాం, పార్డి(బి), మర్లగొండల మీదుగా చిక్లీ చేరుకోవచ్చు. భైంసా–షివిని బస్సు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.
- భైంసా నుంచి నిర్మల్ రహదారిలో కేవలం 5 కి.మీ దూరంలో మాటేగాం కొరడి గణపతిని ఉంటుంది.

బాక్సింగ్ విజేతకు స్వాగతం



మహేందర్‌తో బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో ఇటీవల జరిగిన సీఐఎస్ఎఫ్ ఇంటర్‌సెక్టార్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సౌత్ సెక్టార్ నుంచి పాల్గొని వెండి పతకం సాధించిన మంచిర్యాల క్రీడాకారుడు పాదం మహేందర్‌కు రైల్వేస్టేషన్‌లో ఆదివారం అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికారు. కోచ్ మైసూర్, జిల్లా అసోసియేషన్ బాధ్యులు రవీందర్, సీనియర్ క్రీడాకారులు చిరంజీవి, శ్రీనివాస్, పాదం శ్రీనివాస్, సతీశ్, అశోక్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా పంచాయతీ బారెగూడకు చెందిన మోర్లె పద్మ అదృశ్యం కావడంతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పద్మ ఈనెల 16 నుంచి నుంచి కనిపించడం లేదు. భర్త వసంత్ వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో పద్మ, కుమారుడు సంజీవ్ ఉన్నారు. పని నుంచి వసంత్ ఇంటికి వచ్చాడు. భార్య పద్మ కనిపించకపోవడంతో కుమారుడిని అడగగా మధ్యాహ్నం పొలానికి వెళ్లి తిరిగి రాలేదని చెప్పాడు. కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లలో ఆమె కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. వసంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ఎల్లంపల్లి'కి జలకళ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను ఆదివారం రాత్రి వరకు 19.500 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో కింద ఎగువ ప్రాంతాల నుంచి 12 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి చేరుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 276 క్యూసెక్కులు, 2 గేట్లు ఎత్తి 11 వేల క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.

ఉధృతంగా ప్రాణహిత నది

వేమనపల్లి: వర్షాలు తగ్గుముఖం పట్టాయి. కాని ప్రాణహిత నదికి వరద పోటెత్తుతోంది. దిగువన మేడిగడ్డ వద్ద వరద వెళ్లకుండా కొన్ని గేట్లు మూసి వేయడంతో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. పెన్‌గంగ, వార్ధానది, వైన్ గంగలపై ఉన్న ప్రాజెక్టుల నుంచి నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో గంట గంటకు వరద ఉధృతి పెరుగుతోంది. ఈక్రమంలో వేమనపల్లి పుష్కర ఘాట్, ముల్కలపేట–రాచర్ల మధ్యన ఉన్న బొందచేను ఒర్రెలు వరద నీటితో మునిగిపోయాయి. వరద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నాటుపడవలు ఆపించారు. ప్రాణహిత వరదతో వేమనపల్లి, కల్మలపేట, ఒడ్డుగూడం, రాచర్ల శివరాలు సుమారు 80 ఎకరాల్లో పత్తి నీటమునిగింది.



పంట పొలాల్లో చేరిన నీరు

నీట మునిగిన పంటలు

బెజ్జూర్: ప్రాణహిత ఉప్పొంగి పంటలు నీటమునిగాయి. భారీ వర్షాల కారణంగా మహారాష్ట్రలోని ఆయా ప్రాజెక్టుల గేట్లను వదలడం ద్వారా ప్రాణహితకు ఆదివారం వరద నీరు చేరింది. దీంతో తలాయి, తిక్కపల్లి, భీమారం, పాపన్నపేట. సోమిని, మొగవెల్లి తదితర గ్రామాల ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లో పంట పొలాల్లో నీరు చేరింది. పంటలు నీట మునిగాయి. ప్రాణహిత ఉప్పొంగితే తిక్కపల్లి, భీమారం, తలాయి గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకునే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వేమనపల్లిలో నీటమునిగిన పత్తి పంట

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి



హాజరైన ఫీల్డ్ అసిస్టెంట్లు

పాతమంచిర్యాల: ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సమస్యలు పరిష్కరించాలని సంఘం (బీఆర్ఎస్ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్య అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాంబాబు యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్, కార్యదర్శి వేణు, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజేందర్, పవన్, రాజన్న పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు వీడండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ

నెన్నెల: సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో ప్రజలు మూఢనమ్మకాలను విడనాడాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య సూచించారు. శనివారం రాత్రి నందులపల్లిలో మూఢనమ్మకాలను తొలగించి చైతన్యపర్చడం కోసం పోలీసుల ఆధ్వర్యంలో కళాబృందంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏసీపీ మాట్లాడుతూ ప్రతీ దానికి ఒక శాస్త్రీయ కారణం ఉంటుందని, దానిని ప్రజలు మంత్రశక్తిగా భావించడం జరుగుతుందని, అలాంటివి నమ్మకూడదని తెలిపారు. గ్రామాల్లో యువత డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని కళాబృందం ఆటపాటలతో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్యాంపటేల్, పోలీసులు పాల్గొన్నారు.

'ఆదివాసీ సంస్కృతి ఎంతో గొప్పది'

జైనూర్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పదని సౌత్ కల్చరల్ డైరెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో గుస్సాడీ నృత్యం ప్రదర్శించారు. గుస్సాడీ బృందం అధ్యక్షుడు కనక సుదర్శన్, మార్లవాయి ఉప సర్పంచ్ ధర్మేందర్, గుస్సాడీ బృందం సభ్యులు తదితరులున్నారు.



గుస్సాడీ బృందం సభ్యులు

అనుమానాస్పదంగా ఒకరు మృతి



భీరయ్య మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: అనుమానాస్పదంగా ఒకరు మృతిచెందినట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా భీమిని మండలం చిన్నగుడిపేటకు చెందిన ముదిగిరి భీరయ్య (45) కొన్నిరోజులుగా కాగజ్‌నగర్ మండలం కడంబా శివారులో గొర్రెల మంద ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. మండలంలోని ఆరెగూడ శివారులోని మామిడిచెరువులో ఆదివారం భీరయ్య అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నాడు. భీరయ్య సోదరుడు ఐలయ్య ఫిర్యాదుతో మృతుడి భార్య దేవక్క, బావమరిది పర్వతాలు, మామ శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ పట్టివేత

రెబ్బెన: రెబ్బెన రేంజ్ పరిధిలోని కంపార్ట్‌మెంట్ నంబర్ 304 నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా రాయి (బోల్డర్) తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు గోలేటి బీట్ అధికారి భుక్య రవి తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన ట్రాక్టర్ గోలేటికి చెందిన దుర్గం ఇస్తారీకి గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

పెంచికల్‌పేట్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కొమురయ్య కథనం ప్రకారం.. దహెగాం మండలం తెనుగుపల్లికి చెందిన గోపు పర్వతాలు(48) కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తాగిన మైకంలో ఆదివారం పెంచికల్‌పేట్ మండలం చేడ్వాయి సమీపంలోని పెద్దగుట్ట వద్దకు వచ్చాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతురాలి భార్య కళావతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.